www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
23 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 295

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## నలుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ




- రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్‌లు బదిలీ చేసింది
- ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ
- కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది
- సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా గరిమా
- గతంలో అత్యవసర పరిస్థితుల కారణంగా బదిలీ
- జీ.ఓ.ఆర్టీ.నెం.1340 ద్వారా ఈ ప్రక్రియ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో నలుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్ అధికారి ఎం. రఘునందన్ రావుకు కమర్షియల్ టాక్స్ అదనపు బాధ్యతలు అప్పగించారు. దేవాదాయశాఖ డైరెక్టర్‌గా ఎస్ హరీశ్‌కు, గనులశాఖ డైరెక్టర్ భవేష్ మిశ్రాకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. మిగతా 2లో..

## నా చావుకు కారణం కేటీఆర్

- బీఆర్ఎస్ కార్యకర్తల్లో తీవ్ర ఒత్తిడి
- ఆమోదయోగ్యం కాని నిర్ణయాలు
- వెలుగులోకి కార్యకర్త ఆశాప్రియ
- మహిళా నాయకురాలిగా మంచి పేరు
- సోషల్ మీడియా బీభత్సమైన ఫాలోయింగ్
- జీ.ఓ.ఆర్టీ.నెం.1340 ద్వారా ఈ ప్రక్రియ





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది? నేతలతోపాటు కార్యకర్తలు ఒత్తిడికి గురవుతున్నారా? కార్యకర్తలకు ఆమోదయోగ్యం కాని నిర్ణయాలను తీసుకుంటోందా? అందుకే కేడర్ తలో దారి చూసుకుంటోందా? ఉన్నట్లుండి ఆశాప్రియ ఎందుకు లైమ్ లైట్‌లోకి వచ్చింది? ఇంతకీ ఆమె ఎక్స్ వేదికగా ఏ రాసుకొచ్చారు? అసలు ఆ పార్టీలో ఏం జరుగుతోంది? బీఆర్ఎస్ పేరు చెప్పగానే కార్యకర్తల్లో ముందుగా వచ్చే పేరు ఆశా ప్రియ. యువ మహిళా నాయకురాలిగా మంచి పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు సోషల్ మీడియా ఆమెకి బీభత్సమైన ఫాలోయింగ్ ఉంది. కీలక నేతలను ఎవరైనా టార్గెట్ చేస్తే వెంటనే రంగంలోకి దిగి కౌంటర్ ఇచ్చేవారు. ఇదంతా ఒకప్పటి మాట. సరిగ్గా ఏడాది కిందట కారు పార్టీకి రాజీనామా చేసినట్టు ఎక్స్ వేదికగా వెల్లడించారు. పార్టీకి రాజీనామా చేసినా ఇంకా ఆ పార్టీతో తత్సంబంధాలు కొనసాగిస్తూనే ఉన్నారట ఆమె. తాజాగా కొన్నిక్షణాల ముందు ఆమె ఎక్స్ వేదికగా కీలక కామెంట్స్ చేశారు. నా చావుకు కేటీఆర్, ఆ నేతలే కారణమని రాసుకొచ్చారు. ఆమె ఎక్స్ వేదికగా

మిగతా 2లో..



# నేడే తెలంగాణ కేబినెట్

## నేడు రాష్ట్ర మంత్రి మండలి సమావేశం

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది
- బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థలపై చర్చ
- మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది
- బీసీ రిజర్వేషన్ల అమలుపై కీలక నిర్ణయం
- నీటిపారుదల ప్రాజెక్టులపైనా నిర్ణయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై రాష్ట్ర మంత్రి వర్గం చర్చించనుంది. ఈ సమావేశంలో ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, రైతు భరోసా, నీటిపారుదల ప్రాజెక్టులు.. తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. రేపటి కేబినెట్ సమావేశం అనంతరం ఒకటి రెండు కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం అందుతోంది. అంతేకాక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యాసాధ్యాలపైనా నేటి కేబినెట్ సమావేశంలో చర్చ జరగనుంది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్ కు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. అంతేకాక కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనులు, ఎస్ఎల్బీసీ పనులు, ఎస్సారెస్పీ రెండో దశ.. తదితర నీటిపారుదల ప్రాజెక్టులపైనా తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల అక్టోబర్ 16 న జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలు ఉన్న వారు స్థానిక సంస్థల్లో పోటీ చేయరాదన్న నిబంధనను తొలగించాలని కేబినెట్ తీర్మానించింది. అలాగే రాష్ట్రంలో హ్యామ్ విధానంలో మొదటి దశలో రూ.10,547 కోట్లతో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే అంశంపై మంత్రివర్గం చర్చలు జరిపింది. ఈ విషయంపై లోతుగా అధ్యయనం చేసేందుకు సీఎస్ నేతృత్వంలో ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు అక్టోబర్ 23న మరోసారి సమావేశం కావాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మిగతా 2లో..





## రేండేళ్లలో ఉస్మానియా పూర్తి చేయాలి

- అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై చర్చ
- నిర్మాణం ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలి
- అధునాతన పరికరాల ఏర్పాటు చేయాలి
- ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు
- రూ.2,400 కోట్లతో 14 అంతస్తుల్లో ఆస్పత్రి

02

## రవాణా శాఖ చెక్‌పోస్టుల ఎత్తివేత

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రవాణా చెక్ పోస్టులు తొలిగిస్తూ ఉత్తర్వులు
- మూసివేతపై పూర్తి నివేదిక సమర్పించాలి
- చెక్ పోస్ట్ సిబ్బందికి వేరే బాధ్యతలు
- రవాణా శాఖలో ఏఐ టెక్నాలజీ
- వివరాలు వెల్లడించిన మంత్రి పొన్నం



02

## కొత్త వివాదంలో మాగంటి సునీత!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత
- గోపినాథ్ అకాల మరణంతో ఎన్నికలు
- ఇష్టంలేకున్నా పోటీచేయిస్తున్నారనే టాక్
- కుమారుడు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు
- వజ్రనాథ్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్
- తల్లి మాలిని పేరు అఫిడవిట్‌లో పెట్టలేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాగంటి గోపీనాథ్ మరణం తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టిన జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత చుట్టూ

మిగతా 2లో..





## ఇకపై సమ్మెలు బంద్

- విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థలకు బిగ్ షాక్
- సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉద్యోగులు ఎలాంటి సమ్మెకు దిగకూడదు
- ఉత్తర్వులు నవంబర్ 10 నుంచి అమల్లోకి
- ఆరు నెలల పాటు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు
- అతిక్రమిస్తే క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థలు.. జెన్‌కో, టాన్స్‌కోలో రానున్న ఆరు నెలలపాటు సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌కోకు చెందిన మూడు డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో, జెన్కోలోని.. ఉద్యోగులు ఎలాంటి సమ్మెకు దిగకూడదని ఆదేశాలు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు నవంబర్ 10 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. విద్యుత్ సరఫరా అనేది అత్యవసర సేవ కాబట్టి.. సమ్మెల వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగకుండా ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది మే 10 నుంచి నవంబర్ 9 వరకు పవర్ కార్పొరేషన్లలో సమ్మెలపై తెలంగాణ ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ఆరు నెలల పాటు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భారత్‌లో సమ్మె చేసే హక్కు అందరి కార్మికులకు ఉంది. అయితే ఇది ప్రాథమిక హక్కు కాదు. చట్టబద్ధమైన హక్కు. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్, 1947తో పాటు పలు కార్మిక చట్టాల ప్రకారం.. కొన్ని రంగాల కంపెనీల్లో పరిమితులు, నిబంధనలకు లోబడి సమ్మెలు చేపట్టే హక్కు ఉంది. ఎప్పుడైనా అత్య వసర వస్తుసేవలు అందించే కంపెనీల్లో.. ఉత్పత్తి, సేవలు నిలిచిపోకుండా ఈ హక్కులపై పరిమితులు విధించే

మిగతా 2లో..

## నవీన్ యాదవ్‌కి మద్దతు ఇవ్వండి

**కోదండరాంకి టీపీసీసీ చీఫ్ విజ్ఞప్తి**



02

## పాపం మాధవి లత

- రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మాధవి లత
- ఎంపీ ఓవైసీ మీద ఆమె పోటీ చేశారు
- వినూత్నమైన విధానంలో ప్రచారం చేశారు
- ఆమెకు సొంతంగా ఒక ఆసుపత్రి కూడా ఉంది
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారం
- ఓటర్ల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి

02



# నా చావుకు కారణం కేటీఆర్

( మొదటిపేజీ తరువాయి )

చేసిన పోస్ట్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇంకొన్ని గంటల్లో ఎలాంటి పోస్ట్ రాకుంటే చచ్చిపోతానని, అందుకు సంబంధించిన ఆధారాలు నా వాట్సాప్ చాట్‌లో ఉంటాయని పేర్కొన్నారు. దీనివెనుక ఎవరు చేయిస్తున్నారు. అనేదానికి సమాధానం అక్కడ లభిస్తుందని ప్రస్తావించారు. సోషల్ మీడియాలో తనకు ఎదురవుతున్న వేధింపులు గురించి తన మనసులోని మాటను బయటపెట్టారు. అదే నా మరణ వాంగ్మూలం అని రాసుకొచ్చారు. పార్టీ ఆఫీసుకు యువనేత వస్తే నందినగర్ లేకుంటే జూబ్లీహిల్స్ ఏదో ఒకటి తేల్చుకుంటానని ప్రస్తావించారు. దీనిపై పలువురు ఎక్స్ వేదికగా రియాక్ట్ అయ్యారు. కేటీఆర్ నువ్వు ఏం మనిషివి ? నీ మనుషులు ఏం మాట్లాడుతున్నారు నా గురించి అంటూ ప్రశ్నించారు. పార్టీలో ఉండే మహిళలతో నీకు సంబంధం ఉందని తన ఫోన్ లో చెప్పారని ఆరోపించారు. మాట్లాడిన సాక్ష్యాలు బయటపెట్టాలా అని ఏంది అని నిలదీశారు. తనపై వేధింపులకు పాల్పడుతున్న పిల్ల జమిందార్‌ను తెలిసి కూడా పక్కన పెట్టుకుని ఫోటోలు దిగుతున్నావ్ అంటే.. నువ్వే ఎంకరేజ్ చేస్తున్నావని అర్థం అంటూ ఆరోపించారు. క్యారెక్టర్ ఎవర్ని ఎవరు చంపేస్తున్నారని, ఎవరి ఆరాధన వారికి ఉంటుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత ఆశాప్రియ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆమెని పని గట్టుకుని వేధింపులకు గురి చేస్తున్నట్లు పెట్టిన పోస్టుల ద్వారా తెలుస్తోంది. ఇంతకీ కావాలనే ఆమెని వేధిస్తున్నారా. అయినా జూబ్లీహిల్స్ బైపోల్ ముందు ఇదేమి లొల్లి అనేవారు లేకపోలేదు. మొత్తానికి జూబ్లీహిల్స్ బైపోల్ ఏమోగానీ ఆ పార్టీ ఆశాప్రియ గురించి చర్చ మొదలైనట్టు ఆ పార్టీ వర్గాల మాట. రానున్న రోజుల్లో ఆశాప్రియ ఇంకెన్ని విషయాలు బయటపెడుతుందో చూడాలి. గతంలో ఆశాప్రియ బీఆర్ఎస్ కార్యకర్తగా పార్టీలో ఎంతో చురుకుగా ఉండేవారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ పార్టీకి మద్దతుగా పోస్టులు చేసేశారు. అయితే ఓ నేత వేధింపుల కారణంగా పార్టీకి గుడ్ బై చెప్పారు. అంతకు ముందు పార్టీలో ఒక వెదవ ఉన్నాడు...వాడికి తప్పు ఎవరికి సపోర్ట్ చేసినా అడ్డమైన లింకులు పెట్టి నరకం చూపిస్తాడు అంటూ ఆశ ప్రియా ట్వీట్ చేశారు. కొద్ది రోజుల క్రితం కూడా ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. సూసైడ్ అటెంప్ట్‌కు ముందు 'కేటీఆర్ అన్న ఈ చెల్లెలు పిలుపు ఇదే చివరిసారి అవుతుంది.. ఒక్కసారి పలుకు అన్నా అంటూ ఎక్స్ లో చివరి పోస్ట్ పెట్టారు.

# నవీన్ యాదవ్‌కి మద్దతు ఇవ్వండి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు
- కోదండరాంకి టీపీసీసీ చీఫ్ విజ్ఞప్తి
- కాంగ్రెస్ మద్దతు ఇవ్వాలని కోరారు
- 2023లో మేమెంత కలిసి పోరాడాం
- నవీన్ యాదవ్ ప్రచారంలో పాల్గొనండి
- మతవాద శక్తులకు బుద్ధి చెప్పాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ మద్దతు ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాంకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాద్ నాంపల్లి లో తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మహేష్ కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ నిరంకుశ పాలన విముక్తి కోసం 2023 లో మేమెంత కలిసి పోరాడమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారి సహకారం మరచిపోలేనిదని, ఉద్యోగ నియామక రూపకల్పనలో కోదండ రామ్ సలహాలు సూచనలు విలువైనవన్నారు. కోదండరాం ఆయన పార్టీ తమ పార్టీకి, ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా ఉన్నారని, ప్రస్తుతం జరుగుతున్న జూబ్లీహిల్స్ ఎన్నికల్లో వారి సంపూర్ణ మద్దతు కావాలని కోరామని చెప్పారు. నిరంతరం ప్రజల్లో ఉండి స్థానికుడైన యువకుడు నవీన్‌యాదవ్ విజయానికి జన సమితి పార్టీ శ్రేణులు ప్రచారంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పటికే సీపీఐ, ఎంఐఎం, సీపీఎం పార్టీలు మద్దతు ప్రకటించాయని, తెలంగాణ జన సమితి కూడా నవీన్ యాదవ్‌కి మద్దతు ఇవ్వాలని కోరినట్లుగా మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, మిత్ర పక్షాల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని, వచ్చే కార్పొరేషన్ జాబితాలో మిత్రపక్షాలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకుంటామన్నారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి బండి సంజయ్ సంజయ్ ఏం మాట్లాడుతున్నారో అర్థమవుతుందా అని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఆ స్థాయి వ్యక్తి నోటికొచ్చింది మాట్లాడటం విచారకరమని, మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్ రాజేసి లబ్ధి పొందాలని బీజేపీ నేతల పన్నాగమన్నారు. బీజేపీ నేతలకు పొద్దున లేస్తే దేవుళ్లు, కులాలు, మతాలు కాకుండా యువతకు ఉపాధిపై మాట్లాడాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. ఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాలని, దేశ భవిష్యత్తు ఆలోచన చేయకుండా యువతకు రెచ్చగొట్టే మాటలు చెప్పొద్దని ఆయన బండి సంజయ్ కి హితవు పలికారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని టీపీసీసీ చీఫ్‌తమకు లేఖ రాశారని, స్వయంగా వచ్చి కలిశారని దీనిపై త్వరలోనే పార్టీలో చర్చించి నిర్ణయం చెప్తామని కోదండరాం తెలిపారు. తమ వైపు నుంచి ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఈ సమావేశంలో చేశామని తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని వారు ఆరాటపడుతున్నారని ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. నిరుద్యోగులు కూడా ఉద్యోగ కల్పన కోసం ఎదురు చూస్తున్నారని, వేగంగా కార్యాచరణను ప్రభుత్వం చేపట్టాలని కోదండరాం చెప్పారు. రానున్న ఎన్నికల్లో మిత్రపక్షాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని, కొన్ని సీట్లు అడుగుతున్నామని, జాబితా కూడా ఇస్తామని ఆయన తెలిపారు.



# రేండేళ్లలో ఉస్మానియా పూర్తి చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై రేవంత్ రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకు ఒకసారి సమావేశమై ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయ్యాక అక్కడ బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని రేవంత్ రెడ్డి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆస్పత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మిస్తున్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలకు ప్రతీ నిర్మాణానికి ఒక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ అధికారి నిర్మాణాలను 24 గంటలు పర్యవేక్షించేలా పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించాలని సూచించారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్‌రాజ్, క్రిస్టియానా, ఇలంబర్తి, ముషారప్ అలీ ఫరూఖీ, హరిచందన తదితరులు పాల్గొన్నారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవనానికి జనవరి 31న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గోషామహల్ మైదానంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజ నర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కొత్త ఆసుపత్రి భవనం 2 వేల పడకలతో 26.30 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. రూ.2,400 కోట్లతో 14 అంతస్తుల్లో భవనాన్ని నిర్మిస్తున్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాల్లో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు కల్పించనున్నారు. నూతన ఆసుపత్రి రావడంతో 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ దాదాపు 5 వేల మందికి ఓపీ సేవలందించేలా అభివృద్ధి చేయనున్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కేంద్రంగా ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం నిర్మాణం కానుంది.

## నేడే తెలంగాణ కేబినెట్

( మొదటిపేజీ తరువాయి )

స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే నేడు జరిగే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది వేచి చూడాలి.

# నలుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ

( మొదటిపేజీ తరువాయి )

దేవాదాయ శాఖ నుంచి శైలేజా రామయ్యను సర్కార్ రిలీవ్ చేసింది. మైన్స్ అండ్ జియాలజి డైరెక్టర్‌గా భావేష్ మిశ్రాను నియమించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను గరిమా అగర్వాల్‌కు అప్పగించింది. గరిమా అగర్వాల్ ప్రస్తుతం సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా సేవలందిస్తున్నారు. కాగా, సీనియర్ ఐఏఎస్ అధికారి రిజ్వి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. గరిమా అగర్వాల్ ప్రస్తుతం సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా సేవలందిస్తున్నారు. గరిమా అగర్వాల్ ఇంతకు ముందు కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా సేవలు అందించారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన గరీమా అగర్వాల్ యాదాద్రి భువనగిరి జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా రెండేళ్లు, కరీంనరగ్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా రెండేళ్లు పని చేశారు. గతంలో తెలంగాణ ప్రభుత్వ జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ జీ.ఓ.ఆర్టీ.నెం.1340 ద్వారా కొందరు ఐఏఎస్ అధికారులను బదిలీలు చేసి, కొత్త బాధ్యతలు అప్పగించింది. ఈ మార్పులు అడ్మినిస్ట్రేషన్‌కు అవసరమైన అత్యవసర పరిస్థితుల కారణంగా చేసినవి. ఈ బదిలీలలో రాజకీయ, వ్యాపార పన్నుల, వ్యవసాయ, రవాణా శాఖల్లో మార్పులు ఉన్నాయి. ఈ బదిలీల ప్రకారం, వ్యాపార పన్నుల, ఎక్సైజ్ శాఖలో ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న, 1999 బ్యాచ్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వికి జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో రాజకీయ కార్యదర్శిగా ఫుల్ అడిషనల్ ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ పదవిలో ఇప్పటి వరకు ఉన్న 2002 బ్యాచ్ ఎం.రఘునందన్ రావు.. ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి ఉంది. ఎం.రఘునందన్ రావును వ్యాపార పన్నుల కమిషనర్‌గా బదిలీ చేసి, కొత్తగా పోస్ట్ చేశారు. ఈ పదవిలో ఇప్పటి వరకు 2013 బ్యాచ్‌కి చెందిన కె.హరిత పనిచేస్తున్నారు. ఆమెను ఫైనాన్స్ శాఖలో స్పెషల్ సెక్రటరీగా నియమించారు. ఈ పదవిలో ఇప్పటి వరకు కె.సురేంద్ర మోహన్ (2006 బ్యాచ్) ఉన్నారు. ఆయన్ని వ్యవసాయ, సహకార శాఖలో సెక్రటరీగా బదిలీ చేశారు. ఆయన కోఆపరేటివ్ సొసైటీల కమిషనర్, రిజిస్ట్రార్, మార్కెటింగ్ డైరెక్టర్ పదవుల్లో ఎఫ్ఏసీ బాధ్యతలు కొనసాగిస్తారు. 2013 బ్యాచ్‌కి చెందిన ఎం.హరిత, ఇప్పటివరకూ ఎడ్యుకేషన్ శాఖలో స్పెషల్ సెక్రటరీగా ఉండగా, ఆమెను రాజన్న సిరిసిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. ఇప్పటివరకూ రాజన్న సిరిసిల్లా కలెక్టర్‌గా ఉన్న, 2014 బ్యాచ్‌కి చెందిన సందీప్ కుమార్ ఝాను టీఆర్ అండ్ బీ శాఖలో స్పెషల్ సెక్రటరీగా నియమించారు.

# పాపం మాధవి లత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గత ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో ప్రధానంగా మీడియాలో హైదరాబాద్ నుంచి పోటీ చేసిన మాధవి లత గురించి చర్చ జరిగింది. హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ ఓవైసీ మీద ఆమె పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థిగా వినూత్నమైన విధానంలో ప్రచారం చేశారు. పైగా మాధవి లతకు సొంతంగా ఒక ఆసుపత్రి కూడా ఉంది. సమాజంలో పలుకుబడి కూడా విపరీతంగా ఉంది. అటువంటి మహిళను హైదరాబాద్ ఓటర్లు గెలిపించుకుంటారని అందరూ అనుకున్నారు. స్వయంగా హోంశాఖ మంత్రి అమిత్ షాను కూడా మాధవి లత గురించి ప్రస్తావించారు. వాస్తవానికి ఎన్నికల్లో ఫలితం బీజేపీకి అనుకూలంగా వస్తుందనుకుంటే.. మాధవి లత ఊహించని విధంగా హైదరాబాద్ ఓటర్లు తీర్పు ఇచ్చారు. దీంతో ఆమె ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఓటమి తర్వాత కొంతకాలం పాటు ఆమె పెద్దగా కనిపించలేదు. ఇటీవల కాలంలో తన ఆసుపత్రిలో తగ్గించిన ఫీజుల గురించి ఆమె ఒక వీడియోలో మాట్లాడారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ శాసనసభకు ఉప ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి తరపున ఆమె ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను వెళ్లి నేరుగా కలుస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీకి ఓటు వేయాలని.. హైదరాబాద్ నగర రూపురేఖలు బీజేపీ ద్వారానే మారుతాయి అని ఓటర్లను కోరుతున్నారు. ఆమె రాజకీయ నాయకురాలు కాబట్టి.. పైగా బీజేపీలో ఉన్నారు కాబట్టి ఎన్నికల్లో అలా ప్రచారం చేయడం సర్వసాధారణం. అయితే మాధవి లత సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటారు. మీడియాలో కూడా ప్రముఖంగా కనిపిస్తారు కాబట్టి.. ఆమె గురించి సహజంగానే ప్రజల్లో ఆసక్తి ఉంటుంది. పైగా స్వయంగా ఆమె ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆమెతో మాట్లాడేందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆమెను కొంతమంది ఓటర్లు టార్గెట్ చేయడమే ఇక్కడ అసలైన విషాదం.

మాధవి లత ప్రచారానికి వెళ్తున్న సమయంలో జూబ్లీహిల్స్ ఓటర్లు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మోదీ మా ఖాతాలో డబ్బులు వేస్తానని చెప్పారని.. కానీ ఇంతవరకు వేయలేదని ఓటర్లు ఆమెను ప్రశ్నిస్తే.. వివిధ పథకాల ద్వారా మీ ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయి కదా అని మాధవి లత సమాధానం చెప్పారు. అయితే ఆ పథకాలు తమదాకా రావడం లేదని ఓటర్లు అన్నారు. క్రితం ఎన్నికల్లో మీకే ఓటు వేశామని మెజారిటీ ఓటర్లు మాధవి లతతో చెప్పారు. దానికి ఆమె ఏ గుర్తుకు ఓటు వేశారని అడిగితే.. కారు గుర్తు అని చెప్పారు. కారు గుర్తు తమది కాదని.. తమది కమలం అని చెబితే.. ఏ గుర్తుకు ఓటు వేసినా పెద్దగా ప్రయోజనం లేదని ఓటర్లు పెదవి విరిచారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి అభివృద్ధి చేశారని.. మీరు ఏం చేస్తారో చెబితే ఓటు వేస్తామని ప్రజలు మాధవి లతను ప్రశ్నించారు. దానికి ఆమె ఆలోచించుకుని చెబుతామని అన్నారు. అలాంటప్పుడు మీరు మా వద్దకు ఎందుకు వచ్చారని కొంతమంది ఓటర్లు ప్రశ్నించారు. దీంతో ఆమె వారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. వేగంగా వచ్చేశారు.

# కొత్త వివాదంలో మాగంటి సునీత!

( మొదటిపేజీ తరువాయి )

ఇప్పుడు రాజకీయం నడుస్తోంది. గోపినాథ్ అకాల మరణంతో వచ్చిన జూబ్లీహిల్స్ బైపోల్‌లో.. బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు మాగంటి సునీత. వాస్తవానికి ఆమెకు ఇష్టం లేకున్నా..బీఆర్ఎస్ అధిష్టానమే ఒప్పించి మరీ పోటీ చేయిస్తుందన్న టాక్ నడుస్తోంది. బీఆర్ఎస్‌లో ఏ సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోయినా వారి కుటుంబ సభ్యులకే టికెట్ ఇస్తుంటారు గులాబీ బాస్ కేసీఆర్. ఇక్కడ మాగంటి కూతుర్లలో ఒకరిని..లేకపోతే కుమారుడిని పోటీ చేయించాలని అనుకున్నా వాళ్లు వయసురిత్యా చిన్న వాళ్లు కావడంతో..గోపీనాథ్ సతీమణిని బరిలోకి దించారు. అయితే సునీత బీఆర్ఎస్ అభ్యర్థిగా తెరమీదకు వచ్చినప్పటి నుంచి..ఏదో విషయంలో ఆమె టార్గెట్ అవుతూ వస్తున్నారు. ప్రత్యర్థులకన్నా ఆమె సొంత ఫ్యామిలీ నుంచే వ్యతిరేకత ఎక్కువగా వ్యక్తం అవుతోంది. మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ తనకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఆయన కొన్ని కాంట్రవర్సీ స్టేట్ మెంట్స్ కూడా ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా సునీత మాగంటి గోపీనాథ్ సతీమణి కాదంటూ కొత్త చర్చ తెరమీదకు తీసుకొచ్చారు. ఈ వివాదం వెనుక కూడా మాగంటి కుటుంబీకులే ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.



సునీత అంటే ముందు నుంచి గిట్టని మాగంటి ఫ్యామిలీ ఇప్పుడు ఏకంగా ఆమె భార్య కాదనే ప్రచారానికి తెరలేపుతోందన్న చర్చ నడుస్తోంది. ఇదే అదునుగా మాగంటి గోపీనాథ్ మరో భార్య కుమారుడు ప్రధుమ్న అనే వ్యక్తి ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సునీత.. మాగంటి గోపీనాథ్ భార్య కాదని ఆరోపించారు. సునీత నామినేషన్ రద్దు చేయాలని ఈసీకి ప్రధుమ్న వినతి చేశారు. మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో తన తల్లి మాలిని పేరు చూపించకుండా సునీత పేరు పెట్టారని..తన తల్లి మాలినితో గోపీనాథ్‌కు విడాకులు కాలేదని ప్రధుమ్న అంటున్నారు. మాగంటి గోపినాథ్‌తో సునీత లీవ్ ఇన్ రిలేషన్‌లో ఉన్నారన్నది ప్రధుమ్న వాదన. అయితే గతంలో మాగంటి గోపీనాథ్ అఫిడవిట్స్ అన్నింటిలోనూ తన భార్యగా సునీత పేరునే పేర్కొనే వారు. మరప్పుడు ప్రధుమ్న ఎలాంటి ఫిర్యాదు ఎందుకు చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి. అయితే మాగంటి గోపీనాథ్‌కు సునీత భార్య అవునా.. కాదా అనే విషయాన్ని తేల్చాల్సిన బాధ్యత తమది కాదని ఎలక్షన్ కమిషన్ స్పష్టం చేసింది. ఈ వ్యవహారం కోర్టులో తేల్చుకోవాల్సి ఉంటుందన్నారు ఎన్నికల అధికారులు. దీంతో మాగంటి సునీత నామినేషన్‌కు లైన్ క్లియర్ అయ్యింది. మొన్నటి వరకు మాగంటి సునీత కన్నీళ్ల చుట్టూ రాజకీయం నడిచింది. ఆమె ఎన్నికల ప్రచార సభలో తన భర్తను తలుచుకుని కన్నీళ్లు పెట్టుకోవడం పై.. కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. మాగంటి సునీత సానుభూతి కోసం కన్నీళ్లు కారుస్తున్నారని పొన్నం మాట్లాడిన మాటలు..నెగెటివ్ అయ్యాయి. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో రియాక్ట్ అయింది. జూబ్లీహిల్స్ జనంలో కూడా చర్చ జరిగింది. ఆ తర్వాత ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇదే సమయంలో పలు సర్వేలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా రిపోర్టులు ఇస్తుండటంతో పొలిటికల్ సిచ్యువేషన్ హీటెక్కింది. బీఆర్ఎస్ గెలుపు ధీమాతో ఫుల్ జోష్‌లో ఉంది. అయితే ఓడిపోతామన్న భయంతోనే కాంగ్రెస్ దిగజారి వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ మండిపడుతోంది. మాగంటి సునీత కన్నీళ్లపై రాజకీయం చేయడమే కాకుండా.. ఆమె కూతుర్లు ప్రచారంలో పాల్గొంటే అక్రమ కేసులు పెడుతున్నారని..ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు బీఆర్ఎస్ కూడా మధుమ్న ఫిర్యాదుపై సీరియస్ అవుతోంది. తండ్రి చనిపోతే తలకొరివి పెట్టేందుకు కూడా రాని కొడుకు..ఇప్పుడు నామినేషన్ తిరస్కరించాలని ఫిర్యాదు చేయడం ఏంటని ప్రశ్నిస్తోంది. ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా కాంగ్రెస్ ఆడుతున్న గేమ్ అని ఆరోపిస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో సునీత మాగంటి గోపీనాథ్ భార్య కాదంటూ ఎన్నికల సంఘానికి అందిన ఫిర్యాదు దుమారం లేపుతోంది. ఇప్పటికే ముందస్తు వ్యూహంతో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డితో నామినేషన్ వేయించి పెట్టింది బీఆర్ఎస్. మొత్తానికి జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత పేరు తెరమీదకు వచ్చినప్పటి నుంచో ఏదో ఒక ఇష్యూతో ఆమె టార్గెట్ అవుతూనే ఉన్నారు.



## సదర్ ఉత్సవాలకు హాజరైన డివిజన్ కార్పొరేటర్

**తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో అఖిల బారత యాదవ్ సంఘం అద్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళన ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పశువులను ప్రేమిస్తూ దైవంగా భావించి జరిపే ఉత్సవమే సదర్ పండుగలు అని ఈ పండుగలో భాగంగానే దున్న రాజులను అలంకరించి పూజించి చేసే కోలాహలంలో యాదవుల సోదరులకు దీపావళి అనంతరం జరిపే ఒక గొప్ప పండుగని ప్రతి ఏటా ఇంకా వైభవంగా జరుపుకోవాలని కోరుకుంటూ శ్రీకృష్ణుడి మరియు లక్ష్మీమాత ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటూ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మైలార్ దేవ్‌పల్లి అఖిల భారత యాదవ సంఘం కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డివిజన్ లోని ముఖ్య నాయకులు కార్యకర్తలు యాదవ్ కమిటీ సభ్యులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రవాణా శాఖ చెక్‌పోస్టుల ఎత్తివేత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని అన్ని రహదారులపై రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చెక్ పోస్టుల మూసివేతపై పూర్తి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. దీనిపై ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చెక్ పోస్టులను రద్దు చేస్తూ జీవో జారీ చేసినట్లు ప్రకటించారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి, అన్ని లావాదేవీలు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో జరగాలనే ఉద్దేశంతో రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకుని, ఈరోజు నుండి చెక్ పోస్టులు పూర్తిగా మూసివేస్తూ అమలు చేస్తున్నామని తెలిపారు. రవాణా వ్యవస్థలో ఆధునికత, పారదర్శకతను తీసుకురావడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశమని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం వాహన్ అమలు కొనసాగిస్తోందని, త్వరలోనే సారథి సిస్టమ్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. రవాణా శాఖలో ఏఐ టెక్నాలజీని వినియోగిస్తూ పారదర్శక వ్యవస్థను నెలకొల్పుతున్నామని చెప్పారు. కార్యాలయాల్లో రెగ్యులర్‌గా వచ్చే దరఖాస్తుదారుల వివరాలు స్వయంచాలకంగా రికార్డ్ అవుతూ, హెడ్ ఆఫీస్‌కు అలర్ట్‌లు పంపే విధంగా సిస్టమ్ అమలు చేస్తున్నామన్నారు. అదే సమయంలో వాహనాలకు సంబంధించిన రికార్డులు, టాక్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ వంటి అంశాలను ఆన్లైన్ ద్వారా పర్యవేక్షించే చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్స్) పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.577 కోట్ల ట్యాక్స్ మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. ఇవి వాహనాల అమ్మకాల వాటా 0.03 శాతం నుండి 1.13 శాతానికి పెరిగిందని మంత్రి చెప్పారు. ఢిల్లీలో లాగా కాలుష్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలుగా తెలంగాణ ఇవి పాలసీని రూపొందించిందని వివరించారు. నగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు, ఎల్‌పీజీ, సీఎన్జీ ఆటోలకు 10 వేల చొప్పున, అలాగే 25 వేల రిట్రోఫిటింగ్ ఆటోలకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. పాత వాహనాల స్థానంలో ఇవి వాహనాలను ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా ఆధునిక రవాణా వాతావరణాన్ని సృష్టిస్తున్నామని చెప్పారు. రోడ్ సేఫ్టీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ పలు కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి వివరించారు. నాచారం, కరీంనగర్‌లలో రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. కాలేజీల్లో రోడ్ సేఫ్టీ క్లబ్బులు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో అవగాహన పెంచుతున్నామని చెప్పారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ లైసెన్స్ సిస్టమ్‌ను తీసుకువచ్చే ప్రణాళిక ఉందని తెలిపారు. గత పదేళ్లలో రవాణా శాఖలో అవినీతి మూలాల్లా ఏర్పడిందని విమర్శించిన మంత్రి.. ఇప్పుడు పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామన్నారు. బ్రోకర్ వ్యవస్థను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని.. రాష్ట్రవ్యాప్తంగా 63 కేంద్రాల్లో కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు. 112 మంది AMVI లను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పోలీస్, ఆర్టీసీతో పాటు ఇతర శాఖల్లో ఉన్న పాత వాహనాలను స్క్రాప్‌కి పంపించాలని ఆదేశించామని వివరించారు.

చెక్ పోస్టులను రద్దు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లి కేబినెట్‌లో ఆమోదం పొందినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాబోయే కాలంలో మొత్తం ఆదాయాన్ని ఆన్‌లైన్ ద్వారా సేకరించేలా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.7 కోట్ల వాహనాలు ఉన్నాయని, రోడ్ ప్రమాదాలు తగ్గించేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని వివరించారు. వాహన్, సారథి సిస్టమ్‌ల ద్వారా తెలంగాణ కూడా దేశంలోని మిగిలిన 28 రాష్ట్రాలతో సమానంగా సాంకేతికతలో ముందంజ వేస్తుందని తెలిపారు. గత పదేళ్లలో తెలంగాణ వాహన్, సారథి ప్లాట్‌ఫారమ్‌లలో ఎందుకు చేరలేదో తెలియదు. ఇప్పుడు మేము చేరాం, డేటా ట్రాన్స్‌ఫర్మింగ్ జరుగుతోంది. వాహన్ ఇప్పటికే అమల్లో ఉంది, సారథిని త్వరలో అమలు చేస్తాం. ఇకపై రవాణా శాఖలో అవినీతి లేదా అనధికార వ్యవహారాలకు చోటు ఉండదని మంత్రి స్పష్టం చేశారు.

# ఇకపై సమ్మెలు బంద్

( మొదటిపేజీ తరువాయి )

హక్కు ప్రభుత్వాలకు ఉంటుంది. తెలంగాణ ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటేనెన్స్ యాక్ట్, జాతీయ ఈఎస్ఎమ్ఏ కొన్ని నిబంధనలు రూపొందించాయి. దాని ప్రకారం.. ఎసెన్షియల్ అని డిక్లేర్ చేసిన వస్తుసేవల కంపెనీల్లో.. సమ్మెలు చేయడంపై ప్రభుత్వం నిషేధం విధించొచ్చు. ఆరు నెలల వరకు ఈ పరిమితులు విధించే అవకాశం ఉంది. ఆదేశాలను అతిక్రమించి ఉద్యోగులు సమ్మెల్లో పాల్గొంటే, సమ్మెలను ప్రారంభిస్తే.. వారిపై జరిమానాలు విధించొచ్చు. వారిని సస్పెండ్ చేయొచ్చు. ఇక అతిక్రమణలు తీవ్రంగా ఉంటే.. జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంది. సమ్మె చేయడం చట్టబద్ధమైన హక్కు కాబట్టి.. నిషేధం విధించిన సమయంలో అది ఇల్లీగల్ అవుతుంది. ఈ నిషేధం సమయంలో సమ్మె చేస్తే.. దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. మరోవైపు, తెలంగాణ జెన్కో రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జించింది. విద్యుత్‌ను యూనిట్ రూ.4 చొప్పున డిస్కమ్‌లకు విక్రయిస్తోంది. తెలంగాణ జెన్‌కో అక్టోబర్ 19న అర్ధరాత్రి నాటికి 5000 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రికార్డు స్థాయిలో 202223 ఆర్థిక సంవత్సరంలో 6831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి జరిగింది.

# మళ్లీ కుండపోత వానలు

- నాలుగు రోజులు వానలే వానలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- తెలంగాణపై అల్పపీడన ప్రభావం
- ఈదురు గాలులతో కూడిన వర్షా లు
- 24,25 తేదీల్లో భారీ వర్షా లు
- రాష్ట్రంలో చలితీవ్రత పెరిగే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈ తీవ్ర అల్పపీడనం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉందని.. రాగల 12 గంటల్లో ఇది మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ అల్పపీడన వ్యవస్థ ప్రభావం వల్ల తెలంగాణ రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు వెల్లడించారు. ఈ నెల 24, 25 తేదీల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో 24వ తేదీన భారీ వర్ష సూచన ఉంది.ఈ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి తెలియజేశారు. దక్షిణ తెలంగాణలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట జిల్లాలపై వాయుగుండం ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసినా.. 24వ తేదీ నుంచి తీవ్రత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు విరమించే సమయంలో ఈశాన్య గాలులు రాష్ట్రంలో ప్రవేశిస్తుంటాయని.. ఇవి పూర్తిస్థాయిలో విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ అధికారి వివరించారు. సాధారణంగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లోనే తుపానులు ఎక్కువగా ఏర్పడే అవకాశాలుంటాయని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం కూడా రాగల 12 రోజుల్లో వాయుగుండంగా మారే లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో చలి తీవ్రత క్రమేపీ పెరుగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. నవంబర్ రెండో వారం నుంచి చలి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం పొడిబారిన వాతావరణం, ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఉత్తర తెలంగాణలో చలి తీవ్రత సాధారణంగానే అధికంగా ఉంటుంది. అయితే.. ఈ ఏడాది దక్షిణాది జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనట్లు పరిశీలించవచ్చని వాతావరణ శాఖ అధికారి వెల్లడించారు.

ఇక ఏపీ విషయానికి వస్తే నైరుతి బంగాళాఖాతంలో తమిళనాడు తీరంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం వాయువ్య దిశగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 24 గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపుగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో గురువారం ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రానున్న 5 రోజులు రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. తీరం వెంబడి గంటకు 3555కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలని ప్రభావిత జిల్లాలకు పంపించామని.. ఎవరికైనా సాయం కావాలంటే.. అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా కొమురం భీం జయంతి



**మహబూబాబాద్, విశాల-భారతి:**

స్థానిక పట్టణ శివారులోని నర్సంపేట బైపాస్ రోడ్ లో గల హైదరాబాద్ వారి స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో తెలంగాణ సింహ స్వప్నం, ఆసిఫాబాద్ అడవుల గిరిజనగోండు బిడ్డ, కొమరం భీమ్ జయంతిని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన జయంతి ఉత్సవాల్లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మధు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలోనే ఇది ఒక సువర్ణ అధ్యాయమని, తొలి తెలంగాణ స్వాతంత్ర పోరాట యోధుడిగా కీర్తింపబడ్డ గిరిజన తెగ గుండు బిడ్డ కొమరం భీమ్ కి పూలమాలతో సత్కరించి ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని పుష్పాంజలి ఘటించి, అనంతరం ఆయన తెలంగాణ గిరిజన సమాజానికి చేసిన సేవలను స్మరిస్తూ, ఆయన చేసిన త్యాగాలు తెలంగాణ సమాజానికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ జీవితంలో పోరాట స్ఫూర్తిని తీసుకొని జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కొమరం భీమ్ ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ లోని సంకపల్లి గ్రామంలో 1901 అక్టోబర్ 22న జన్మించారని, ఆయన వారి తండ్రి నుంచి పొందిన స్ఫూర్తిని గుండె నిండా నింపుకొని తెలంగాణ సమాజం కోసం, గిరిజనుల హక్కుల కోసం, తన జీవితమంతా రజాకారులకు వ్యతిరేకంగా పోరాడి చివరకు 1940 అక్టోబర్ 27న నిజాం సైనికుల చేతిలో పరమపదించారు. ఆయన పోరాట నినాదం "జెల్ జంగల్ జమీన్" దీనిని సాధించడం కోసమే గెరిల్లా వంటి యుద్ధం ఉద్యమాన్ని చేపట్టి ఎంతోమందికి స్ఫూర్తి నింపి, తన సైన్యంతో రజాకార్లను ఎదిరించారు. నేటితరం విద్యార్థినీ విద్యార్థులు దేశం కోసం పోరాడిన త్యాగ వీరుల గురించి త్యాగ వీరుల గురించి, వారి జీవిత విశేషాలను తప్పకుండా పుస్తకాలు చదవడం ద్వారా, వారి అనుభవాలను తమ అనుభవాలుగా మలుచుకుని జీవిత పాఠాలు నేర్చుకోవాలని ఆయన అభిలాషించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె. చంద్రమౌళి, మాట్లాడుతూ స్వస్తిక్ స్కూల్ కేవలం తరగతి నాలుగోడల లో విద్య అందించడం మాత్రమే కాకుండా విద్యార్థులలో సామాజిక అంశాల పట్ల పరిపక్వత సాధించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకి బాటలు పడతాయని, ఇక్కడున్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు నిరంతరం వారి యొక్క సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియుప్రతి ఒక్క విద్యార్థి పుష్పాలతో కొమరం భీముని చిత్రపటానికి సత్కరించి చాలా సంతోషం వెలిబుచ్చారు. చిన్నారులు కొమరం భీమ్ నినాదాలతోహోరెత్తించారు. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కొమరం భీం జయంతిని చాలా ఘనంగా జరుపుకున్నారు.

## కాలిపోయిన స్కూల్ బస్సు

**ఎవరు లేకపోవడంతో తప్పిన ప్రమాదం**

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రోడ్డుపై వెళ్తున్న ఓ స్కూల్ బస్సు అందరూ చూస్తుండగానే కాలిపోయింది. ఈ సంఘటన మైలార్దేవ్‌పల్లి డివిజన్ లోని లక్ష్మీగూడ వాంబే కాలనీ రహదారిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్గుల్ కి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు సాయంత్రం సమయంలో బాంబే కాలనీ రహదారిలో వెళ్తుండగా ఒక్కసారిగా ఇంజిన్ లో మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి. ఇంజిన్ భాగం నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్ హరి ప్రసాద్ వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన నిలిపాడు. క్షణాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా అగ్నికి కాలిపోయింది. సంఘటన స్థలానికి చేరుకున్న చంద్రయాన్ గుట్ట అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.



## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**పెద్ద అంబర్పేట్ , విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ లోని సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాలయం దేవాలయంతో సమానం. విద్యార్థుల భవిష్యత్తు, వారి భవితవ్యానికి ప్రజా ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోంది అని అన్నారు. 1998లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ స్థాపనకు తాను 10 ఎకరాల భూమిని కేటాయించిన విషయం గుర్తుచేసుకున్నారు. కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృష్ణ వాటర్ నల్లా ప్రారంభించి, విద్యార్థులకు, అధ్యాపకులకు స్వచ్ఛమైన మంచినీరు అందించేలా చర్యలు తీసుకున్నారు.తన ప్రసంగంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి డిప్లమా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి. విద్యార్థుల అభివృద్ధి కోసం పలు కంపెనీలతో మాట్లాడి సి ఎస్ ఆర్ ( CSR )నిధులను మంజూరు చేయిస్తాను అని హామీ ఇచ్చారు. అలాగే, ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, కేవలం రెండు సంవత్సరాల్లోనే దాదాపు 1.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగముని నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,సింగిల్ విండో చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ చారి, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## క్యాంటీన్ ప్రారంభించిన ఎస్ఐ

**దేవరప్పుల, విశాలభారతి:**

మండలం సింగరాజు పల్లి గ్రామం మెయిన్ రోడ్ చౌరస్తాలో పూజరి.మహేష్ చిన్నమడూరు గ్రామం ఈరోజు నూతన క్యాంటీన్ స్థానిక ఎస్సై సృజన్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో సదుపాయంగా ఇలాంటి చిరు వ్యాపారాలు ఈ క్యాంటీన్ వంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని, తెలిపారు. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఇలాంటి స్వయం ఉపాధి కార్యక్రమాలు ద్వారా యువత అభివృద్ధి పథంలో నడవాలని, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హయత్‌నగర్ స్టేషన్ సందర్శించిన డీసీపీ

**పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:**



రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఎల్.బి.నగర్ డీసీపీ బుధవారం రోజు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో సమావేశమై, దృఢమైన,ప్రజా కేంద్రీకృత పోలీసింగ్ పై దృష్టి పెట్టాలని సూచించారు.డీసీపీ మాట్లాడుతూ, చట్టాన్ని అమలు చేయడంలో నిజాయితీ, నిబద్ధత మరియు క్రమశిక్షణతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కాపాడుతూ, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. అలాగే, బీట్ పహారా, కనిపించే పోలీసింగ్, నిఘా, నేర నివారణ, ప్రజా శాంతి భద్రత వంటి అంశాలపై మరింత శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా నేర దర్యాప్తు పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.డీసీపీ మేడమ్ మాట్లాడుతూ.. పోలీసింగ్ విజయాన్ని కేవలం నేరాల సంఖ్యతో కాకుండా, ప్రజల్లో నమ్మకం సంతృప్తి ఆధారంగా కొలవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, డి ఐ,ఎస్ ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగండ్ల మార్కెట్ అభివృద్ధికి కృషి

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** శేరిలింగంపల్లి డివిజన్ లోని నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన అత్యవసర పనులను గుర్తిస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా మార్కెట్ అభివృద్ధి పనులను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. మార్కెట్ ను మోడల్ మార్కెట్ గా పునర్నిర్మించే దిశగా గొప్ప సంకల్పంతో తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ భాస్కర్, మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి చింతకింది రవీందర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఖాజాపాషా, ఎస్ ఎల్ విడిసి ప్రెసిడెంట్ రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్,రషీద్,



మహమ్మద్ అజీమ్,సురేష్ రాథోడ్, రాజు,మొయిన్,దాదు,దత్త రెడ్డి, షరీఫ్, లాల,చందు మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 69వ ఎస్‌జీఎఫ్ఐ జోనల్ క్రీడోత్సవాలు

**తొర్రూర్, విశాలభారతి:**



తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో 69వ SGFI జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక క్రీడోత్సవాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్ట్ చైర్మన్ మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలోనూ ప్రతిభ కనబరిచేలా అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని,గ్రామీణ ప్రాంతాల నుండి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే ప్రతిభలు ఎన్నో ఉన్నాయి. అలాంటి పిల్లలకు ప్రోత్సాహం ఇవ్వడం, వారికి వేదిక కల్పించడం మా ట్రస్ట్ యొక్క ప్రధాన లక్ష్యం అని తెలిపారు.క్రీడలు శారీరక దృఢతతో పాటు మానసిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయ పాలన, టీమ్ స్పిరిట్ వంటి విలువలను క్రీడల ద్వారా అలవర్చుకోవాలని సూచించారు.ఈ క్రీడోత్సవాల నిర్వహణకు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 1,30,000 (ఒక లక్ష ముప్పై వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించడం జరిగింది అన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా సాగిందని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పాఠశాల తరపున అధ్యాపకులు మాట్లాడుతూ, ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు సామాజిక సేవలకు మాటలు సరిపోవు. గ్రామీణ విద్యార్థులకు క్రీడా అవకాశాలు కల్పించడంలో వారు చూపుతున్న దాతృత్వం ప్రశంసనీయం, అని అన్నారు. ట్రస్ట్ గతంలో కూడా పలు జిల్లాలో గ్రామాల్లో విద్యా సహాయ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మహిళా సాధికారత కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మనసులు గెలుచుకుంది. ఈ క్రమంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల అభివృద్ధికి చేయూతనందిస్తోంది అన్నారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి విజేత విద్యార్థులకు బహుమతులు, ట్రోఫీలు అందజేసి అభినందించారు.



## సదర్ సమ్మేళనంలో పాల్గొన్న ఉప్పల

**ఎల్బీనగర్, విశాలభారతి:**

నాగోల్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్ ఆహ్వానం మేరకు నిర్వహించిన సదర్ సమ్మేళనం లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ యాదవ్ సమాజం సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ సదర్ ఉత్సవం, తెలంగాణ సాంస్కృతిక సంపదకు ప్రతీకగా నిలుస్తుంది అని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం యాదవుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నాడు అని ఆయన అన్నారు. సదర్ని అంగరవైభవంగా నిర్వహిస్తున్న యాదవులు అందరికీ అభినందనలు తెలిపారు.సమాజంలోని ప్రముఖులతో ఆత్మీయంగా సంభాషించి, ఇలాంటి సాంప్రదాయ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్, నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సహకార సంఘం చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డి

**పెద్ద అంబర్‌పేట్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం రైతు సహకార సంఘం చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డి నియమితులైన సందర్భంగా పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు గంట లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం జైపాల్‌రెడ్డి ఎల్లప్పుడూ కృషి చేస్తారు. ఆయన నాయకత్వంలో రైతు సంఘం మరింత బలపడుతుందని మేము విశ్వసిస్తున్నాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**దేవరుప్పల, విశాలభారతి:**

దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపిన ప్రకారం సింగరాజు పల్లి గ్రామానికి చెందిన శుద్ధపల్లి అనిల్ తండ్రి మల్లయ్య అనే వ్యక్తి అక్టోబర్ 12న ఆదివారం రోజున కొంగరి రాములు అనే అతని వద్దకు వెళ్లి శుద్ధపల్లి అనిల్,దుబ్బ ప్రశాంత్, పాకాల శేఖర్,ఈ ముగ్గురూ కలిసి రాములుకు గల కిరాణాషాప్ వద్దకు వెళ్లి 2000/రూ"లు డిమాండ్ చేసి అతని ఇవ్వకపోతే, చంపుతానని బెదిరించి, డబ్బులు తీసుకున్న విషయం పై కొంగరి రాములు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి అక్టోబర్ 22 బుధవారం రోజు శుద్ధపెల్లి అనిల్ ను రిమాండ్ చేసి జనగామ కోర్టు యందు హాజరు పరిచాము, కోర్టు అతనికి రిమాండ్ విధించనుంది అతనిని చర్లపల్లి జైలుకు తరలించనున్నారు అని ఎస్ఐ ఉర సృజన్ కుమార్ తెలిపారు.

## రాజకీయ బలం చాటే సమయం వచ్చింది

**బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్**

**పెద్ద అంబర్ పేట్ ,విశాలభారతి:**



బహుజన సమాజం తమ శక్తిపై నమ్మకం కోల్పోవడం, ఆధారపడే మనస్తత్వంతో కొనసాగడం వలన నాయకత్వ స్థానాలకు రాలేకపోతున్నారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ.. ఆధారపడే మనస్తత్వం, మన శక్తి మీద మనకు (బహుజనులకు) నమ్మకం లేకపోవడమే నాయకులుగా ఎదగలేకపోవడానికి ప్రధాన కారణం. బీసీలు ఆధిపత్య పార్టీలు విడిచి బహుజన పార్టీలో చేరితే, తమ అసలైన బలం ఏమిటో దేశానికి చూపించగలరు. మన బలం మనలోనే ఉంది. మనం అనుకున్నది మన కాళ్ల దగ్గరికి వస్తుంది అని అన్నారు. ఇబ్రాం శేఖర్ బహుజన సమాజం ఐక్యంగా ముందుకు రావాలని, స్వీయ విశ్వాసంతో రాజకీయ మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్యార మల్లేష్, చిత్రం కృష్ణ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఎస్పీ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ప్రహ్లాద్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ పరిధిలో గల తంగడపల్లి గ్రామంలో 5 వ వార్డు బ్రహ్మంగారి గుడి ప్రాంగణంలో చుట్టుపక్కల వారు చెత్త వేయడంతో మురికి వాసన,దోమల బెడద ఎక్కువైనందున ఈ విషయంపై బుధవారం రోజున మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు.దానికి వారు స్పందించి వెంటనే శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మునుగోడు నియోజకవర్గ నాయకులు గట్టు మొగలయ్య ముదిరాజ్,వివిధ పార్టీల గ్రామ యువకులు ముటకులోజు సంతోష్,కేతరాజు మహేష్,ముటుకులోజు నిఖిల్ సాయి,బండి చంటి,బి. సాయి తదితరులు పాల్గొన్నారు .



# 'నమస్తే తెలంగాణ' పత్రికపై దాడి

**వరంగల్ , విశాలభారతి:**

వరంగల్ లోని మడికొండలో నమస్తే తెలంగాణ పత్రిక కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ కి చెందిన నాయకులు బుధవారం దాడి చేసి విధ్వంసం సృష్టించారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రిక ప్రతులను చింపి, సిబ్బందిని అడ్డుకున్నారు. చివరికి పోలీస్‌లు అక్కడికి చేరుకొని దాడికి పాల్పడుతున్న వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై యూనిట్ బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**ఐజేయు ఆధ్వర్యంలో..**

పత్రిక కార్యాలయాలపై దాడులు అనైతిక చర్య అని టీయూడబ్ల్యూ జె (ఐజెయూ )జిల్లా కమిటీ అధ్యక్షులు శ్రీ రామ చందర్, కార్యదర్శి మట్ట దుర్గా ప్రసాద్, కోశాధికారి కోదాటి గోపి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఏ రాజకీయ పార్టీ అయినా దాడులకు పాల్పడటం సరైన చర్య కాదని, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# కుమ్రం భీం ఆశయాలను సాధించుకోవాలి

**భీం 124 వ జయంతిలో మంత్రి సీతక్క**

**కొత్తగూడ, విశాలభారతి:**



ఆదివాసీ హక్కుల కోసం జల్ జంగిల్ జమిన్ నినాదం తో పోరాడి అమరుడు అయిన ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం 124 వ జయంతి నీ పురస్కరించుకొని మండలం కేంద్రం లో ఆదివాసీ ప్రజా సంఘాలు నిర్వహించిన భీం జయంతి కార్యక్రమం లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దనసరి సీతక్క పాల్గొని పూలమాల వేసి నివాళిలు అర్పించారు. సీతక్క మాట్లాడుతు భీం ఆదివాసీ ల హక్కులు అయిన అడవి, నీరు,భూమి కోసం జల్ జంగిల్ జమిన్ నినాదం తో పోరాడాడు అని ఆదివాసీ లు హక్కుల కోసం ఉద్యమించాలి అని అన్నారు. ఆదివాసీల కోసం ఆదివాసీ పోరాట యోధులు జరిగిన పోరాటాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది వారి పోరాటాలు ఆదివాసీలకు తెలియాల్సిన అవసరం ఉంది కొత్త గూడ మండలం కేంద్రం లో సెంట్రల్ లో కుమ్రం భీం బిర్స ముండా నిలువెత్తు విగ్రహాలు ఏర్పాటు చేయాలనీ అందుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు రమణల లక్ష్మయ్య, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, తుడుం దెబ్బ రాష్ట్ర జిల్లా మండల నాయకులు బుర్క యాదగిరి, వట్టం కన్నయ్య, సువర్ణ పాక వెంకట రత్నం, కుంజ నర్సింహా రావు, పూనేం సందీప్ దొర, ఆదివాసీ సేన కల్తీ నరేష్, ఆలూరి రాజు,ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఈసం రామస్వామి, పెండకట్ల లక్మి నర్సు ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు కల్తీ ఎల్లయ్య, ఆదివాసీ దొర పట్టేళ్ళు, వజ్జ సారయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగూడ, మల్లెల రణధీర్, ఇర్ప శ్రీకాంత్ ఆదివాసీ సంఘాల నాయకులు ఆదివాసీ మహిళలు పాల్గొని భీం కీ నివాళులు అర్పించారు.

# జిల్లా ఎస్పీని సన్మానించిన హుస్సేన్

**జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్**

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్ టీం సభ్యులు కలిసి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ. దేశ సరిహద్దులో సైనికులు ఎంత ముఖ్యమో దేశంలో పోలీసు వ్యవస్థ అంతే అవసరం దానికి అనుగుణంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు రాష్ట్ర తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీ శశిధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవలే యూరియా సమస్యలు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేయడము వరదల సమయంలో 18 మండలాల ఎస్సైలను సిఐలను డీఎస్పీలను అలర్ట్ చేసి ప్రజల ప్రాణాలు కాపాడడం మరియు డ్రగ్స్ విషయంలో వారు చేస్తున్న సేవలకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వారిని అభినందించి సన్మానం చేయడం జరిగింది. పోలీస్ వ్యవస్థ అంటేనే నమ్మకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య. మహబూబాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ పాక ధర్మేశ్వరరావు. జాయింట్ సెక్రెటరీ గండి మురళి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో మెరిసిన రాంపూర్ వాసి

**హుజురాబాద్, విశాలభారతి:**

స్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గోసికొండ శ్రీరాములు దేశానికి ప్రాతినిథ్యం వహించి, రాంపూర్ ఖ్యాతి విశ్వవ్యాప్తం చేశారు. ఈనెల 21 నుంచి 23 వరకు స్వదేశీ నిర్వహణ, సంస్థాగత అధ్యయనాలు లక్ష్యంగా మెల్ బోర్న్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కెనడా, బ్రెజిల్, యూకే, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో పాటు దాదాపు 60 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కాగా, శ్రీరాములు వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల ఉనికి, రాజ్యాధికారం, సాంస్కృతిక సంఘర్షణ మీద అన్వేషణ అనే అంశాలపై పరిశోధనాపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. అలాగే, భారతదేశంలో రహస్యంగా జరిగే ఆధిపత్యాన్ని సినిమాగా ప్రదర్శించినట్లు తెలిపారు.

# జర్నలిస్టును పరామర్శించిన నాయకులు, పాత్రికేయులు



**కురవి, విశాలభారతి:**

ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి తట్టుపల్లి గ్రామంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న టియుడబ్ల్యూజే (ఐజేయు) దాడులు నియంత్రణ కమిటీ జిల్లా కోకన్వీనర్ బేతమల్ల సహదేవ్ గారిని పలువురు నాయకులు, పాత్రికేయులు పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, ఐజేయు మండల ఉపాధ్యక్షులు గండమాల రోషయ్య, ఐజేయు సీరోలు మండల ప్రధాన కార్యదర్శి మడ్డి వీరన్న గౌడ్, అలాగే పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, లు కలిసి జర్నలిస్టు బేతమల సహదేవ్ ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ సహదేవ్ ఎల్లప్పుడూ పాత్రికేయుల హక్కుల, ప్రజల సమస్యల పరిరక్షణ కోసం ముందుండి పోరాడే ధైర్యవంతుడని, ఆయన త్వరగా కోలుకోవాలని, తిరిగి తన ఉద్యమ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# గుడి నిర్మాణ పనులను పరిశీలించిన బడుగు లక్ష్మయ్య

**టీడీపీ మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్**

**చౌటుప్పల, విశాలభారతి:**



మండలంలోని కట్టమైసమ్మ దేవాలయం నిర్మాణము మరమ్మత్తులు జరుగుతున్న దానిని పరిశీలించిన తెలుగుదేశం పార్టీ ముదుగోడు నియోజకవర్గం ఇంచార్జ్, చౌటుప్పల్ మండల టిడిపి అధ్యక్షులు బడుగు లక్ష్మయ్య.కట్టమైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తదనంతరం వారు మాట్లాడుతూ చౌటుప్పల ప్రాంతంలో నీటి సమస్య చాలా ఉన్నది గత కొద్ది రోజుల నుండి కురిసిన వర్షాల వల్ల మల్కాపురం తెప్పలచెరువు నుండి కైతాపురం లక్కారం గ్రామాలలో చెరువులు నిండి అలుగు ద్వారా చౌటుప్పల చెరువులోకి నీళ్లు వస్తున్నది గత పది సంవత్సరాల నుండి నీటి కొరత తో బాధపడుతున్న ప్రజల యొక్క కోరిక మేరకు భగవంతుడు కరుణించి వర్షాలు పడటం వల్ల కొంత సేద తీర్చిన వాళ్ళు అయినారు కానీ గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేరువు నిర్మాణంలో చోరువ తీసుకొని కట్ట నిర్మాణములు పటిష్టంగా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే నిర్మాణ పనులకు అధిక మొత్తాన్ని కేటాయించి పటిష్టంగా చేయాలని,కట్టకు గ్రానైట్ రాళ్లతో సిమెంటుతో కట్టను పటిష్టంగా చేయాలని డిమాండ్ చేశారు.చౌటుప్పల చిన్న కొండూరు రోడ్డు ఇరుకుగా ఉండటం వలన వాహనాలు రాకపోకలకు అవంతరాయం జరుగుచున్నది కావున కట్ట పైనుండి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేస్తున్నాము. పట్టణ కేంద్రంలోని హైవే రోడ్డుకు ఇరువైపుల రోడ్డు నిర్మాణం చేయకుండా కొద్ది నెలల నుండి ఆపి నందున ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.కావున స్థానిక శాసనసభ్యులు దీనిపై చొరవ తీసుకోవాలని చెరువు కట్ట నిర్మాణంలో కూడా చొరవ తీసుకొని పనిచేయించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్,ప్రధాన కార్యదర్శి వర్గాల వెంకటేష్ గౌడ్,మండల ఉపాధ్యక్షు లు మారగోని అశోక్ గౌడ్,చౌటుప్పల మున్సిపల్ టిడిపి అధ్యక్షులు సుంకరి జంగయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి చిలువేరు రాజు,మండల బీసీ సెల్ అధ్యక్షులు గోవిందా చారి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సదర్ ఉత్సవాలు



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

దీపావళి పండుగ అనంతరం యాదవ సోదరులు ప్రతీ సంవత్సరం సాంప్రదాయంగా నిర్వహించే సదర్ ఉత్సవాలు ఈసారి హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ప్రాంతమంతా ఉత్సవ వాతావరణం నెలకొంది. రంగురంగుల అలంకరణలు, డప్పుల నినాదాలు, గేదెల ఊరేగింపులతో ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , మన్సూరాబాద్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి సదర్ ఉత్సవాల్లో పాల్గొని యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.హయత్‌నగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి కాస్‌బాగ్‌లో జెల్ల కుటుంబ సభ్యులు నిర్వహించిన సదర్ వేడుకల్లో, అలాగే ఉగాది కాంప్లెక్స్ వద్ద ఉగాది కుటుంబం నిర్వహించిన ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం హయత్‌నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ వద్ద నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సదర్ పండుగ యాదవ సమాజం సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. ఈ పండుగలో పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలందరూ ఒకే వేదికపై చేరి ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని, ఈ పండుగ మత సామరస్యానికి, సోదరభావానికి, ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు దీపాలతో మెరిసిపోతూ ఉత్సవ వాతావరణాన్ని సృష్టిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నాయకులు బొడ్డుపల్లి జనార్ధన్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మండల మాలధారణ దీక్ష

- **కందికొండ, ఎడ్జెర్ల స్వాముల భక్తిశ్రద్ధలతో మండల దీక్ష ప్రారంభం**
- **గురుస్వాముల ఆధ్వర్యంలో పుణ్యకార్యక్రమం**

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధల నడుమ అయ్యప్ప మండల దీక్ష మాలధారణ కార్యక్రమం నిర్వహించబడింది. కురవి మండలం కందికొండ గ్రామం, మరిపెడ బంగ్లా మండలం ఎడ్జెర్ల గ్రామాల భక్తులు ఈ పుణ్యకార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం పది మంది స్వాములు భక్తి భావంతో మాలధారణ చేసుకున్నారు. గురుస్వామి శంకూరి కృష్ణ స్వామి, గూగులోత్ ప్రకాష్ స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, స్వాములందరికీ అయ్యప్ప నియమాచారాల గురించి వివరించారు. మాలధారణ చేసిన వారిలో నాగేశ్ స్వామి, నవీన్ స్వామి, ఉపేందర్ స్వామి, మహేందర్ స్వామి, శ్రీకాంత్ స్వామి, రమేష్ స్వామి తదితరులు ఉన్నారు. మాలధారణ అనంతరం "స్వామియే శరణం అయ్యప్ప" నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. స్వాములు 41 రోజులపాటు కఠిన నియమాచారాలతో దీక్షలో ఉండబోతున్నట్లు తెలిపారు. ఇక పిరియావన పుణ్యయాత్రకు కావలసిన ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాములకు ఆశీర్వచనాలు తెలుపుతూ భక్తి వాతావరణాన్ని అలరించారు. అయ్యప్ప భక్తి శ్రద్ధలు ప్రతిచోటా వ్యాపించగా, మహబూబాబాద్ పట్టణం భక్తి తరంగాలతో నిండిపోయింది.

# విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తనపై ఆగ్రహం

- **న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు**
- **మద్దతు ఇచ్చిన డిఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నేతలు**
- **విద్యార్థుల ఆగ్రహం, డిఎస్ఎఫ్ఐ మద్దతు**

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన కనబరచిన ఘటన తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఈ స్థాయికి దిగజారడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచే విద్యార్థులు పాఠశాల ఎదుట గుమిగూడి నినాదాలతో ధర్నా చేపట్టారు. "విద్యార్థినుల గౌరవం కాపాడాలి", "అసభ్య ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలి" అంటూ రోడ్డుమీద నిలబడి నినాదాలు చేశారు. గత నాలుగు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు కలెక్టర్ కార్యాలయానికి లేఖ రాసినా స్పందన రాకపోవడంతో ఈరోజు ఆందోళనకు దిగారు. ఈ విద్యార్థుల పోరాటానికి డెమోక్రటిక్ విద్యార్థి సమాఖ్య మద్దతు తెలిపింది. రాష్ట్ర కోశాధికారి గుగులోతు సూర్యప్రకాశ్, నాయకుడు శివ వర్మ లు చేరుకుని విద్యార్థులకు ధైర్యం చెప్పి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నందు, సాయినాథ్, అరుణ్, వినయ్, సంతోష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# స్వీపింగ్ పనులను పరిశీలించిన కమీషనర్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్రనగర్ లోని బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలో 12 డివిజన్ లోని హిమయత్ సాగర్, 20వ డివిజన్ లోని కాళీమందిర్ జంక్షన్ మరియు 17వ డివిజన్ లోని కిస్మత్ పూర్ ప్రధాన రహదారులపై స్వీపింగ్ పనులను నగర కమీషనర్ బి.శరత్ చంద్ర పరిశీలించారు. రహదారిపై స్వీపింగ్ చేస్తున్న సమయంలో వేగంగా వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకోని అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ ఐ జి వెంకట్ రెడ్డి, శానిటరి జవాన్లు సురేష్, నరేందర్, వెంకటేష్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**అడ్డగూడూరు, విశాలభారతి:**

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవా లని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మారం, కోటమర్తి, చౌళ్ళరామారం, రేపాక డి గ్రామలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సామేలు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని పిలుపునిచ్చారు. సన్న వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఐకెపి నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ప్రభాకర్, రవీందర్, మోత్కూర్ మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి ,పిఎసిఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జోజి, ఏపీఎం కళావతి, ఎంఈఓ సబిత రెడ్డి, తహశీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శంకరయ్య, ఏవో పాండురంగ చారి, వినోద్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చంద్రయ్య , మార్కెట్ డైరెక్టర్లు విద్యాసాగర్, సోమన్న, సీనియర్ నాయకులు పాశం సత్యనారాయణ,చిరంజీవి, పిఎసిఎస్ డైరెక్టర్లు వేముల బిక్షం, సురేందర్ రెడ్డి, సైదులు, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు నవనీత, అక్షర, దయాకర్, సీసీలు యాదయ్య, ప్రసాద్ మహిళా సంఘం సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.





# అయ్యప్ప స్వాములకు నిత్యన్నదానం

- **సెవెన్ హిల్స్ వెంకటేశ్వర స్వామి టెంపుల్ లో నిర్వహణ**
- **కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నిత్యన్నదానం**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్పలకు మాల ధారణ స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పాల్గొని స్వాములకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..గత మూడు సంవత్సరాలుగా జరుగుతున్న అన్న సమారాధన కార్యక్రమంలో భాగంగా నేటి నుండి డిసెంబర్ 4 వరకు అన్నదానం తన ఆధ్వర్యంలో దాతల సహకారంతో జరుగుతుందని తెలిపారు.అయ్యప్ప దీక్ష మాల ధారణ స్వాములు అందరు ఈ నిత్యాన్నదానంలో పాల్గొని ఆ అయ్యప్ప కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, అర్చకులు పురోహితులు అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్ష పదవి స్థానికులకు ఇవ్వాలి

**జక్కిడి ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , అలాగే ఏఐసిసి సెక్రటరీ రాష్ట్ర కోఇంచార్జ్ పి. విశ్వనాథన్ ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్ష పదవిని జిల్లాకు చెందిన స్థానిక నేతలకు మాత్రమే కేటాయించాలని కోరారు. గత అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేసిన స్థానిక నాయకులను గుర్తించి ఆ పదవిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా ప్రజలకు దగ్గరగా ఉండి, పార్టీ పట్ల నిబద్ధతతో సేవ చేస్తున్న నాయకులకు అవకాశమిస్తే, కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుంది అని పేర్కొన్నారు. అంతేకాకుండా, డిసిసి అధ్యక్షుని ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, కేవలం స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
గురువారం
23 అక్టోబర్ 2025
CINEMA

# కొత్త లోకని తెలుగులో తీస్తే డిజాస్టర్



మలయాళంలో రికార్డులు సృష్టించిన 'లోక-చాప్టర్ 1' సినిమా తెలుగులో తెరకెక్కించి ఉంటే డిజాస్టర్‌గా నిలిచి ఉండేదని తెలిపాడు టాలీవుడ్ ప్రముఖ నిర్మాత నాగవంశీ. తన బ్యానర్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొటుంది చిత్రయూనిట్. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నిర్మాత నాగవంశీ కొత్త లోక సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.కొత్త లోక సినిమాను తెలుగులో తీసి ఉంటే అట్టర్‌ఫ్లాప్, డిజాస్టర్ అయ్యేదని తెలిపాడు. తెలుగు ప్రేక్షకులు లాజిక్‌లు, రియాలిటీ గురించి మాట్లాడుతూ ఇదేం సినిమా? అని ప్రశ్నిస్తూ ఫ్లాప్ చేసేవాళ్లు. మలయాళ ప్రేక్షకులు కథలో మునిగి పోతారు, ఎమోషన్స్‌కు లోనవుతారు. అదే తెలుగులో జరిగితే.. పచ్చి బూతులు తిట్టేవాళ్లు ఇలాంటి క్రాస్-కల్చరల్ కంటెంట్‌కు మా ప్రేక్షకుల అడాప్టబిలిటీ కీలకం అని నాగవంశీ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నాగవంశీ మాటలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతున్నాయి. మరోవైపు తన బ్యానర్ నుంచి వచ్చిన వార్ 2 ఫ్లాప్ గురించి కూడా మాట్లాడిన నాగవంశీ ఆదిత్య చోప్రాను నమ్మాం, కానీ మిస్‌ఫైర్ అయింది. సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగింది అని ఓపెన్‌గా చెప్పారు.


# ట్రోల్స్‌కి దోశతో సమాధానం

యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కూతురుగా సినీ పరిశ్రమలో అడుగు పెట్టిన శృతి హాసన్‌కి తొలి రోజుల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదురయ్యాయి. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ ఇలా మూడు ఇండస్ట్రీలోనూ నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. కానీ కెరీర్ ఆరంభంలో వరుసగా ఫ్లాప్ సినిమాల వల్ల ఆమెను "ఐరన్ లెగ్" అని పిలిచారు. అయితే పవన్ కళ్యాణ్‌తో చేసిన 'గబ్బర్ సింగ్' ఆమె కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. అప్పటి నుంచి శృతి వెనక్కి తిరిగి చూడలేదు. ఇప్పడామె పాన్ ఇండియా లెవల్‌లో సినిమాలు చేస్తోంది. అన్ని భాషల్లోనూ ఆఫర్లు అందుకుంటూ అభిమానులను సొంతం చేసుకుంది. అయితే శృతి సినిమాల ఎంపిక విషయంలో సోషల్ మీడియాలో తరచూ విమర్శలు ఎదుర్కొంటుంది. కొన్ని సినిమాల్లో కేవలం ఐటెం సాంగ్‌కి లేదా చిన్న పాత్రలకే పరిమితమైందని కామెంట్స్ వచ్చాయితాజాగా వచ్చిన 'కూలీ' సినిమాలోనూ ఆమె పాత్రపై విమర్శలు వచ్చాయి. మోనికా పాటలో పూజా హెగ్డేకు ఉన్న గుర్తింపు స్థాయిలో కూడా శృతికి ప్రాధాన్యం లేదని నెటిజన్లు విమర్శించారు. ఈ కామెంట్స్‌కు శృతి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చింది. సోషల్ మీడియాలో మూడు ఫోటోలు షేర్ చేసింది. మొదటిది దోశ ఫోటోతో "దోశ = లైఫ్" అంటూ పోస్ట్ చేయడం ద్వారా తనకు సింపుల్ థింగ్స్‌లోనే హ్యాపీనెస్ దొరుకుతుందని తెలిపింది. రెండోది మేకప్ రూంలో వర్కింగ్ మూడ్ ఫోటో. ఇది షేర్ చేస్తూ "వర్క్ మోడ్ ఆన్!" అంటూ ట్రోల్స్‌పై పరోక్షంగా గుద్దింది. చివరిది జిమ్‌లో వర్కౌట్ చేస్తూ ఉన్న ఫోటో, "లైఫ్ ఈజ్ గుడ్" అని చెబుతూ తాను ట్రోల్స్‌కి పట్టించుకోనని స్పష్టం చేసింది. ప్రస్తుతం శృతి హాసన్ చేతిలో పలు ప్రాజెక్టులు ఉన్నాయి. 'సలార్ 2' లో ఆమె పాత్ర కీలకంగా ఉంటుందని సమాచారం. అలాగే విజయ్ సేతుపతితో ఓ కొత్త సినిమా, ఇంకా రెండు ప్రాజెక్టులు వచ్చే ఏడాదిలో విడుదలకు సిద్ధమవుతున్నాయి.



# ఈ ట్విటర్ మేధావులు థియేటర్లకు అస్సలు వెళ్లరు

ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న టాలీవుడ్ యాక్టర్లలో ఒకరు రవితేజ. తనదైన మ్యానరిజంతో ఎంటర్‌టైన్ చేయడం రవితేజ స్టైల్. క్లాస్, మాస్, యాక్షన్, కామెడీ.. ఇలా జోనర్ ఏదైనా అందులో రవితేజ మార్క్ ఎలిమెంట్స్ కనిపిస్తుంటాయి. చాలా కాలంగా సరైన హిట్స్ లేక ఢీలా పడిపోయిన రవితేజ మళ్లీ గోపీచంద్ మలినేని డైరెక్షన్‌లో క్రాక్ సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. ఈ మూవీతో సెకండ్ ఇన్నింగ్స్ షురూ చేసి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసుకుంటూ ముందుకెళ్తున్నాడు.అయితే రవితేజ సినిమాలు రొటీన్‌గా ఒకే పంథాలో ఉంటున్నాయంటూ నెట్టింట పలువురు కామెంట్స్ చేశారని తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్విటర్ ఎప్పుడూ నెగెటివిటీతో నిండి ఉంటుందని రీసెంట్‌గా కామెంట్స్ చేశాడు రవితేజ. ఇప్పుడు మరోసారి బోల్డ్ కామెంట్స్ చేసి అందరి అటెన్షన్ తనవైపునకు తిప్పకుంటున్నాడు. ఈ ట్విటర్ మేధావులు థియేటర్లకు అస్సలు వెళ్లరు. జనాలు నన్ను గీతాంజలి లాంటి సినిమాలో చూడరు. నేను నిజాయితీగా ప్రయత్నించినప్పడల్లా ఆ సినిమాలను ప్రోత్సహించలేదన్నాడు రవితేజ. మనం ఏం చేసినా పర్వాలేదు.. వాళ్లు (ట్విటర్ జనాలు) కామెంట్స్ చేస్తూనే ఉంటారు. నేను ఒకే రకమైన సినిమాలు చేస్తున్నానని వారు చెబుతున్నారు. కానీ జనాలు వారిని గమనిస్తున్నారు. కమర్షియల్ సినిమాలు చేయడం అంత సులభమేమీ కాదు. దీనికి సరైన కొలమానం కావాలి. కరోనా సంక్షోభం ఓటీటీ కంటెంట్‌కు అలవాటు పడిన కొంతమంది జనాల మైండ్‌సెట్‌ను మార్చేసింది. కానీ వారిలో కొంత మందైతే మాత్రం థియేటర్లకు రారంటూ చెప్పకొచ్చాడు రవితేజ. ఇప్పడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.




# ఇంకెన్నాళ్ళు ఈ ఎదురుచూపులు..

అను ఇమ్మాన్యుయేల్.. ఒకప్పడు ఊపేసింది ఈ అమ్మడు. తెలుగులో ఈ బ్యూటీ చేసింది కొన్ని సినిమాలే అయినా తన అందంతో కట్టిపడేసింది. , ఈ బ్యూటీ తెలుగు, తమిళం, మలయాళ చిత్రాలలో నటిస్తుంది. ఆమె 1997 మార్చి 28న అమెరికాలో జన్మించింది. టెక్సాస్‌లోని డల్లాస్‌లో పెరిగింది.అను ఇమ్మాన్యుయేల్.. ఒకప్పడు ఊపేసింది ఈ అమ్మడు. తెలుగులో ఈ బ్యూటీ చేసింది కొన్ని సినిమాలే అయినా తన అందంతో కట్టిపడేసింది. , ఈ బ్యూటీ తెలుగు, తమిళం, మలయాళ చిత్రాలలో నటిస్తుంది. ఆమె 1997 మార్చి 28న అమెరికాలో జన్మించింది. టెక్సాస్‌లోని డల్లాస్‌లో పెరిగింది. అను తండ్రి తంకచన్ ఇమ్మాన్యుయేల్, ఒక ప్రముఖ మలయాళ చిత్ర నిర్మాత. చిన్నతనంలోనే నటనపై ఆసక్తి పెంచుకున్న అను, తన సినీ ప్రస్థానాన్ని బాలనటిగా మొదలుపెట్టింది. అను తొలిసారిగా 2011లో "స్వప్న సంచారి" అనే మలయాళ చిత్రంలో బాలనటిగా కనిపించింది.తర్వాత, 2016లో "యాక్షన్ హీరో బిజు" అనే మలయాళ చిత్రంతో కథానాయికగా అడుగుపెట్టింది. అదే సంవత్సరంలో తెలుగులో "మజ్ను" చిత్రంలో నాని సరసన నటించి, తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ చిత్రంలో ఆమె నటనప్రేక్షకులను మెప్పించింది.తర్వాత ఆమె పవన్ కళ్యాణ్‌తో "అజ్ఞాతవాసి", అల్లు అర్జున్‌తో "నా పేరు సూర్య" వంటి తెలుగు చిత్రాలలో నటించింది, అయితే ఈ చిత్రాలు ఆశించిన విజయం సాధించలేదు. దాంతో తమిళ్ లో అదృష్టాన్ని పరీక్షించుకుంది. తమిళంలో "తుప్పరివాలన్" (2017)తో అరంగేట్రం చేసిన ఈబ్యూటీ, "నమ్మ వీట్టు పిళ్లై" (2019) చిత్రంతో కమర్షియల్ విజయం సాధించింది.ప్రస్తుతం అను చేతిలో పెద్దగా చెప్పకోదగ్గ సినిమాలు లేవు. దాంతో సోషల్ మీడియాలోనే ఎక్కువ సమయం గడుపుతుంది ఈ చిన్నది. తాజాగా అను ఇమ్మాన్యుయేల్ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తన అందంతో మరోసారి కవ్వించింది ఈ వయ్యారి భామ.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.